అమెరికా తెలుగు సంఘం, అమృత్‌కిరణ్ సంయుక్తంగా నిర్వహించిన కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

# మై స్వీట్ బేబీ

కాశీనాథ & కాశీనాథ



వైజయంతి ఇంటి పనులతో బిజీగా ఉంది. బూజులు దులపడం, ఇల్లు కడగడం, ఫోటోలన్నీ తుడిచిమళ్లీ జాగ్రత్తగా పెట్టడం - మరోపక్క బాబునీ, పాపనీ చదివించుకోవడం, హోంవర్కు చేయించడం, ఇస్త్రీ బట్టలు సర్దుకోవడం, దిండ్లకీ, పరుపులకీ కవర్లు వేయడం...

సంక్రాంతి పండుగ వచ్చింది. అందులోనూ పినమామ గారు వస్తున్నామని ఉత్తరం రాసారు.

ఇల్లు అద్దంలా పెట్టుకోవడం వైజయంతికి ఇష్టం.అందులోనూ ఎవరైనా వస్తున్నారంటే మరీ హడావిడి పడుతుంది.

ఇంట్లో ఉన్నది గ్యాస్ స్టవ్ కానడంవల్ల వంట యింట్లోనుంచి పొగరావటం లేదు గాని ఉత్తరం గదిలోనుంచి తలుపులూ, కిటికీలూ అన్నీ మూసి ఉన్నాకూడా సందుల్లోనుంచి పొగవస్తోంది.

అది సిగరెట్ పొగ.

ఆ గదిలో వైజయంతి భర్త చక్రవర్తి, మరో అయిదుగురు స్నేహితులు బిజీగా ఉన్నారు పేకాటలో.

తలుపు కొట్టి హోటల్ కుర్రాడు వచ్చాడు. పకోడీలూ, కాఫీలూ తెచ్చాడు.

మంచినీళ్లు అంతకు ముందే పెద్ద కూజాతో పెట్టుకున్నాడు చక్రవర్తి.

ఈజీగా బతకాల్సిన ఆట కౌంట్ అవటంతో షాక్ తిన్నాడు చక్రవర్తి.సామాన్యమైన జాగ్రత్తలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా కార్డులు తియ్యడం వల్ల ఫలితం అనుభవించాల్సి వచ్చిందని బాధపడ్డాడు.

'రైజులో ఉన్నప్పుడు అలాంటి పొరపాటు చెయ్యకూడదు'' అనుకున్నాడు.

ఈ మాటు జాగ్రత్త పడ్డాడు. ఒక్కొక్క కార్డూ తీసుకునేటప్పుడు ఒక పూర్తి రౌండ్ తిప్పాడు.

పదమూడు ముక్కలూ తీసుకున్నాక వాటిని మళ్లీ ఒక పూర్తి రౌండ్ తిప్పాడు.

తలక్రిందులు కార్డులని నిలువుగా నిలిపాడు. ఒళ్లో కూర్చున్న బాబుని ఎడమతొడమీదనుంచి కుడి తొడమీదకి మార్చాడు.

నర్వరు తనకి తిరుగులేని అదృష్ట చిహ్నం. అతను పకోడీలు ఇవ్వడానికి తన దగ్గరికి రాగానే చటుక్కున ముక్కలు తెరిచాడు.

ముందు రెండూ,తర్వాత రెండూ , తర్వాత చివర్లో అయిదూ తీసాడు. ఏసెస్ తలక్రిందులుగా లేకుండా జాగ్రత్త పడ్డాడు.

కార్డులు సర్దుకుంటుంటే అతని కళ్లు జిగేల్ మన్నాయి. ఫోర్ కార్డు సీక్వెన్స్, రెండు జోకర్లు, రెండు ఫెయిర్‌లు, విజయగర్వంతో అతని కళ్లు మెరిసాయి. అందులో అది జాక్ పాట్ ఆట!

అతను రిస్కు తీసుకోదల్చుకోలేదు. పేకలో నుంచి తీసుకునే ప్రతీకార్డూ చేతితో తట్టి రెండు రౌండ్లుతిప్పి తీసుకున్నాడు. రెండు కార్డులు కలిసాయి. ఆట (ఎక్స్) టెన్షన్ కి వచ్చింది.

తర్వాతి కార్డు తీసే సమయానికి అనుకో కుండా వచ్చింది అతని కూతురు గీత. అనుమానంగానే కార్డు తీసాడు. కార్డు కలవలేదు.

పక్కవాడి ఆట అయిపోయింది!'నువ్వెళ్లు' అని కసిరాడు సంగీతని. కళ్లనిండా తెలియని కోపం. గీత బిక్కమొహం పెట్టి వెళ్లిపోయింది.

'ఏమిటి అలా ఏడుస్తున్నావు ! ? ''

అంది వైజయంతి కూతుర్ని దగ్గరకితీసుకుంటూ.

'ఏమో .ప్రోగ్రెస్ కార్డు చూపించి సంతకం పెట్టించుకుందామని వెళ్తే డాడీ పొమ్మన్నారు.'అంది గీత కళ్లల్లో నీళ్లు తిరుగుతుండగా.

ప్రోగ్రెస్ కార్డు మీద వైజయంతి సంతకం పెట్టింది. మార్కులు అన్నీ ఎనభై అయిదుపైనే.

కూతుర్ని సముదాయిస్తోంటే వీధిలో రిక్షా ఆగింది.

శ్రీ కాంత్ రావుగారు దిగారు.

'అమ్మా! తాతయ్య వచ్చారే' అంది గీత సంబరంగా.

వైజయంతి చటుక్కున ఉత్తరం గది తలుపులు మూసి కర్టెన్ వేసేసింది.అది ఆయన దృష్టిలో

పడినా,గమనించనట్టే ఊరుకున్నాడు.అరగంట తర్వాత బయటకు వచ్చి బాబాయిని పలకరించాడు.

రెండు రోజులున్నాడు ఆయన. వచ్చిన క్షణంలో ఉన్న ఉత్సాహం ఆయనకి క్రమంగా తగ్గిపోయింది.

పండుగకి ఒక రోజు గారెలు, పాయసం, రెండో రోజు పులిహోరా, రవ్వకేసరి చేసింది.

ఒక సినిమాకి కూడా వెళ్లారు.

ఆయన బయటికి వెళ్లినప్పుడు పక్కింట్లో ఓ రెండు గంటలు రమ్మీ ఆడుకుని వచ్చాడు చక్రవర్తి.

వస్తూంటే ఒక మాట వినపడింది!

అంతకుముందు ఎంతసేపు మాట్లాడాడో ఏమో " నేనే నీ తండ్రినైతే వాడికి నిన్నిచ్చి చేసేవాడిని కాను" అని బాబాయి వైజయంతి తో అనడం వినపడింది!

★ ★ ★

సాయంత్రం ఆయన వెళ్ళిపోయాడు.

చక్రవర్తి స్టేషన్‌లో దించివచ్చాడు.

ఇంటికి వచ్చినప్పటినుంచీ ఒక్క మాటకూడా మాట్లాడలేదు.

దెబ్బతిన్న వాడిలా ఉన్నాడు.

ఎప్పుడో గాని సిగరెట్లు కాల్చని వాడు వరసగా సిగరెట్లు కాల్చాడు.

రాత్రి అన్నంకూడా సరిగ్గాతినలేదు.

నిద్ర పోయే వేళఅయినా కూడా సీరియస్‌గా టేబుల్‌ముందు కూర్చుని న్యూస్ పేపర్ చూస్తున్నాడు.

పనులు ముగించుకుని వచ్చింది వైజయంతి.

కాసేపు నిశ్శబ్దం.సిగరెట్టు వెలిగించాడు చక్రవర్తి.

అతనేదో మాట్లాడబోతున్నాడని గ్రహించి ఆగింది ఆమె.

"పేకాట మొదలుపెడితేరోజుల తరబడి ఆడుతూ వదిలి రాలేనంత పిచ్చినాకు లేదు. అవునా?"అన్నాడు.

"అవును"అంది వైజయంతి.

"నాకు పేకాటలో పెద్దగా నష్టాలురావు. ఒకవేళ నెలకి ముప్ఫయిరోజులూ నష్టం వచ్చినా నేనాడే స్టేకుకి అయిదారొందలకి మించి నష్టంరాదు. అది తట్టుకునే స్తోమత నాకుంది. అవునా?"

"అవును"

'పేకాటలో కూర్చుని కాఫీలూ, టీలూ అతిగా తాగి, సిగరెట్లు అతిగా కాల్చి ఆరోగ్యం పాడుచేసుకోవడం అనేది నేనుచెయ్యడంలేదు. అవునా? "

'అవును"

"మా పేకాట గ్యాంగు అంతటికీ కాఫీలు, టిఫిన్లూ సప్లయి చెయ్యమని నేను భార్యని అగౌరవపరచడంలేదు. అవునా ? "

"అవును"

ఒక్కసారిగా చక్రవర్తి కంఠస్వరం పెరిగింది.

"మరిదేనికిట ఆ ముసలాయన అంతంతమాట లనడం ?నాలో ఏ అవలక్షణం చూశాడుట అలా మాట్లాడటానికి? " అన్నాడు విసురుగా.

వైజయంతి కొద్ది క్షణాలు మౌనంగా ఉండి తర్వాత "చాలా చూశారు" అంది.

అతను షాకు తిన్నట్టు చూసి 'ఏమిటి ?' అన్నాడు.

"మీకు పోస్ట్‌మేన్ కవరు ఇస్తేదాన్ని రెండు పూర్తి రౌండ్లు తిప్పారు - తిప్పితే అది మంచి ఉత్తరం అవుతుందా? రిక్షాలో వెడుతూ సినిమాకి టిక్కెట్లు దొరుకుతాయో లేదోనని మీ బాబాయిఅన్నప్పుడు అలవాటుగా మీ ఎడమ తొడ మీద కూర్చునే బాబుని కుడితొడ మీదికి మార్చుకున్నారు.

అన్నిటి కంటే ముఖ్యం- దూరంనుంచి హాలు దగ్గర జనాన్ని చూసి 'ఇరుకుగా ఉంది 'అన్న సాకుమీద రిక్షాని ఆపించి గీతని బాబాయి రిక్షాలోకి పంపారు. టిక్కెట్టు క్యూలో నుంచున్నప్పుడు టిక్కెట్లు అయిపోతున్నాయని ఎవరో అంటే గీతని దూరంగా నుంచోమన్నారు.

పాపదగ్గరలేకపోతే టిక్కెట్లు దొరుకుతాయా?

సినిమాహాలు వాడు చిల్లరనోట్లు ఇస్తోంటే రెండు నోట్లు, రెండు నోట్లు చొప్పున తీసుకునిచివర్లో ఒకసారితీసుకున్నారు.

ఏమనుకోవాలి మీ ప్రవర్తనని ? ఎలా వచ్చిందనుకోవాలి ?

మీకు పేకాట బాగావచ్చు. కాని మీకు ఆటీన్ రాణీయో, డైమండ్ పదో , ఇస్పేట్ నాలుగో , జోకరో కావలసివస్తే మీరు అప్రయత్నంగా ఏం చేస్తున్నారో మీకు తెలుస్తోందా?

కార్డులని తిప్పడం, తిరగెయ్యడం. ఆ ప్రయత్నం వల్ల కావలసిన కార్డు వస్తుందా? క్లబ్బు నాలుగు, డైమండ్ అయిదు అవుతుందా?

చిన్నపనికైనా,పెద్ద పనికైనా మనిషికి మానవ ప్రయత్నం మీద నమ్మకం ఉండాలి. అదృష్టం మీద కాదు. అదృష్టం కూడా కలసిరావాలని అనుకుంటూ మనిషి ప్రయత్నం చేయాలి.

మనిషికి అదృష్టం మీద ఆధారపడే గుణం అలవాటుచేస్తూ, మానవ ప్రయత్నం అలవాటు తప్పిస్తూ ఏ రీజనింగుకీ అందని ప్రయత్నాలూ , సెంటిమెంట్లూ, అలవాటు చేస్తున్న ఆట ఇచ్చే దుష్ఫలితాలకి ఎందుకు లొంగిపోతున్నారు?

ఆ సెంటిమెంట్లని నిజజీవితంలోకి ఎందుకు తీసుకువస్తున్నారు ?

పాపనెందుకు బలి చేస్తున్నారు ?

"మై స్వీట్ బేబీ" " మైస్వీట్ బేబీ " అని మీరు ముద్దుగా పిలిచే పాప ఇప్పుడు ఇంత "ఏంజెంట్ బేబీ" ఎలా అయింది?

ముఖ్యమైన విషయాలు మాట్లాడుకునేటప్పుడు మీకు తెలియకుండానే పాపనెందుకు దూరంగా నెట్టేస్తున్నారు ?

ఎప్పుడో ఒకటి రెండు సార్లు పాప మీ దగ్గర కూర్చున్నప్పుడు కౌంట్ పడితే అది పాప చేసిన తప్పా? అందుకని ఫస్టు, సెకండుర్యాంకులు తెచ్చుకుంటోన్న పాపలో ఆత్మ విశ్వాసాన్ని క్రమంగా ఎందుకు చంపేస్తున్నారు ?

ఆ పిచ్చి ఇంకా ముదిరి పేకాటసెంటిమెంట్లు నిజజీవితంలోకి బాగా వచ్చి పాప మీకు'ప్రథమ శత్రువు' లా కనిపిస్తే నేనేం చేయాలి?

దాన్ని పై చదువులు చదివించడానికీ , పెళ్లి చేయడానికి మీకు అభ్యంతరాలు వస్తే నేనేం చేసేది?

'మై స్వీట్ బేబీ' కలకాలం మైస్వీట్ బేబీ' గానే ఉండాలంటే నేనేం చేయాలి?

వైజయంతి ఏడుస్తోంది.

చక్రవర్తి దిగ్భ్రమతో చూశాడు భార్యని.

మొదట్లో ఆశ్చర్యం..పిదప అంతర్మథనం మొదలైంది అతడిలో.

**కాశీనాథ & కాశీనాథ**

## పరిమళం

పగ ప్రతీకారాన్ని కోరుతుంది
'దారిద్రం' జీవితాన్ని తాకట్టు పెడ్తుంది
ఇది చరిత్ర చెప్పిన సత్యం
నీళ్ళల్లోనైనా దాని ప్రభావం కోల్పోదు ముత్యం-
అలానే
మంచివారి మాటలకు
ఎప్పుడూ ఉంటుంది విలువ
సూర్యోదయాన్ని చూడగానే
వికశిస్తుంది కలువ...
సంపాదించే వాడొకడు
తిని, త్రేన్చే వాళ్ళు అనేకం
మానవత్వపు దృక్పథంలో
చూపించు నీ నిర్వాకం-

-కొప్పర్తి రామారావు,
శ్రీ కుమార్ భవనం మేడపైన,
పవరుపేట, ఏలూరు.